క్లుప్తంగా

కోలాహలంగా జల్లికట్టు

వడమాలపేట (విజయపురం): మహాశివరాత్రి పురస్కరించుకొని వడమాలపేట మండలం బాలినాయుడు కండ్రిగలో బుధవారం కోలాహలంగా జల్లికట్టు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సుమారు 100కు పైగా ఎద్దులను తీసుకువచ్చి జల్లికట్టు నిర్వహించారు. ఓ ఎద్దు బావిలో పడిపోవడంతో జేసీబీ సాయంతో వెలికితీశారు.

నేడు బీసీ రుణాల ఇంటర్వ్యూలు

వెదురుకుప్పం: మండలంలో బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు గురువారం ఉదయం 10 గంటలకు వెదురుకుప్పంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని ఎంపీడీఓ అమర్నాథ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు రుణ దరఖాస్తు, ఆధార్, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, బ్యాంకు పాస్‌బుక్ జెరాక్సులతో హాజరు కావాలని కోరారు.

తమిళ్ డేటా ఎంట్రీ పోస్టుకు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలోని నిరుద్యోగులకు సీతమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో తమిళ్ డేటా ఎంట్రీ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఏజీఎస్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ నిర్వాహకులు రూపేష్‌బాబు తెలిపారు. ఈ పోస్టులకు మార్చి 1వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 100 పోస్టుల భర్తీకి చర్యలు చేపడుతున్నామన్నారు. నెలకు రూ.17,500 జీతం ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 08572-234531ను సంప్రదించాలని పేర్కొన్నారు.

కొల్ల.. జన జాతర!

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరులో శ్మశానకొల్ల అంటే జన జాతరను తలపిస్తుంది. ఈ తరం కూడా పూర్వీకుల కట్టుబాట్లకు కట్టుబడి శ్మశాన కొల్లను కొనసాగిస్తోంది. మహాశివరాత్రి మరుసటి రోజు ఈ ఉత్సవాన్ని అట్టహాసంగా.. సంప్రదాయబద్ధంగా జరిపిస్తోంది. ఈ శ్మశాన జాతర చిత్తూరులో ఏటా వినూత్న రీతిలో నిర్వహిస్తోంది. దక్షుడి సంహారమే ఈ కొల్ల ప్రత్యేకతగా చాటిచెబుతోంది. ఉత్సవాన్ని చూసేందుకు చుట్టు పక్కల రాష్ట్రాల ప్రజలు భారీగా తరలివస్తుంటారు. నేడు(గురువారం) శ్మశానకొల్ల ఉత్సవం కోలాహలంగా జరగనుంది. శివరాత్రి పర్వదినం మరుసటి రోజు చిత్తూరు నగరం సంతపేట నీవానది ఒడ్డున ప్రతి ఏటా శ్మశానకొల్ల (మయానసేవ)ను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గత 192 ఏళ్లుగా ఈ సేవను వంశపారపర్యంగా స్థానిక కుటుంబీకులు నిర్వహిస్తూ వస్తున్నారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి నీవానది ఒడ్డున జరిగే శ్మశానకొల్లకు తీసుకెళ్లారు. అక్కడ దక్షుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి దక్ష సంహారం చేయడం ఈ కొల్ల ప్రత్యేకత.

దక్షసంహారమంటే..

పరమశివుడి భార్య సతీదేవి. ఆమె తన తండ్రి దక్షుడి నిర్వహించే యజ్ఞానికి ఆహ్వానం లేకున్నా వెళుతుంది. అక్కడ అవమానానికి గురై ఆత్మార్పణ చేసుకుంటుంది. ఈ విషయం తెలిసి ఆగ్రహించిన శివుడు తన భార్య మృతికి కారకుడైన దక్షుడిని సంహరించి రమ్మంటూ వీరభద్రుడిని పంపుతాడు. అతడు యజ్ఞం జరిగే చోటుకు చేరుకుని యజ్ఞశాలను ధ్వంసం చేసి దక్షుడిని సంహరిస్తాడు. అప్పటికి శివుడు శాంతిస్తాడన్నది పురాణ గాథ. ఈ రకంగా పూర్వీకులు ప్రారంభించిన ఈ దక్షుడి సంహారాన్ని వారి తరతరాల వారు కూడా ఆచరిస్తూ వస్తున్నారు. అప్పటి నుంచి కూడా దక్షుడి సంహారానికి అంకాళపరమేశ్వరితో పాటు భక్తులు శ్మశానకొల్లకు వేలాదిగా తరలివస్తారు.

కొల్లకు జనజాతర

మయాన సేవకు తిలకించేందుకు రాష్ట్ర ప్రజలే కాకుండా తమిళనాడు, కర్ణాటకవాసులు భారీ సంఖ్యలో తరలి వస్తుంటారు. దీంతో నీవానది ఒడ్డుప్రాంతం గురువారం మధ్యాహ్న ప్రాంతంలో జనంతో కిక్కిరిసి ఉంటుంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు.

హరహర మహాదేవ..!






నింద్ర: శివాలయంలో ప్రత్యేక అలంకరణలో శివలింగం, కార్వేటినగరం: ప్రత్యేక అలంకరణలో శిష్టా సౌందర్యవల్లీ సమేత సదాశివేశ్వరస్వామి, సదాశివకోనలో ప్రత్యేక అలంకరణలో సదాశివుడు, ప్రత్యేక అలంకరణలో నాగలింగేశ్వరుడు

- శివ నామస్మరణతో మార్మోగిన ఆలయాలు
- ఆలయాల్లో భక్తులకు అన్నదానం

నగరి: నగరి మున్సిపల్, మండల ప్రాంతాల్లోని ఆలయాల్లో మహాశివరాత్రి ఉత్సవాలు బుధవారం వైభవంగా నిర్వహించారు. కీళపట్టు త్రిపురసుందరి సమేత చంద్రమౌళీశ్వర ఆలయంలో ఉదయం నుంచి భక్తులు బారులు తీరారు. గుండ్రాజుకుప్పం హనుమతేశ్వర క్షేత్రంలో బిల్వార్చన, మహాభిషేకం, శివ భజన కార్యక్రమాలకు భక్తులు తరలివచ్చారు. హనుమతేశ్వర స్వామిని, 60 అడుగుల ఎత్తున్న అభయ ఆంజనేయ స్వామిని, సరస్వతి దేవిని, అలాగే బుగ్గ కాశీవిశ్వేశ్వర ఆలయంలో కాశీ విశ్వేశ్వరస్వామిని, పరివార దేవతలను దర్శించుకున్నారు. పలువురు బుగ్గ వద్ద ఉన్న దొనల్లో వచ్చే నీటిలో పవిత్ర స్నానాలు ఆచరించారు. నగరి కరకంఠేశ్వరస్వామి ఆలయంలో శతరుద్ర మహాయాగం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఆలయంలో దీపాలు వెలిగించి ఆ తర్వాత లింగోద్భవ పూజలకు భక్తులు హాజరయ్యారు. కేవీపీఆర్‌పేట అరుణాచలేశ్వర ఆలయం, ముడిపల్లె అగస్తీశ్వర ఆలయం, నాగతీర్థం కొండపైనున్న నాగలింగేశ్వర స్వామి, మాంగాడు మార్కండేయస్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, శివభజనలు చేశారు. ప్రతి ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు. అలాగే, కీళపట్టు చంద్రమౌళీశ్వర ఆలయం, కేవీపీఆర్‌పేట అరుణాచలేశ్వర స్వామి ఆలయంలోను నిర్వహించిన శివరాత్రి పూజల్లో మాజీ మంత్రి ఆర్కేరోజా పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మున్సిపల్ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, స్థానిక నాయకులు యాకోబు, అయ్యప్ప, కృష్ణమూర్తి, బాబు, మోహన్‌రాజ్, మురుగ, ఆనంద్‌కుమార్, ఎల్లప్పరెడ్డి, మునివేలు, సలీం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నింద్ర: స్థానిక శివాలయంలో ఉదయం స్వామి వారికి అభిషేకాలు ,అర్చనలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. అలాగే ఎలకాటూరు, అత్తూరు, చవరంబాకం గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.



చిన్నజంబాడలో స్వామి వారికి పూలమాల సమర్పిస్తున్న ఆర్కే రోజా, నాయకులు

భక్తులతో శైవక్షేత్రాలు కిటకిట

వడమాలపేట (విజయపురం): వడమాలపేట మండల వ్యాప్తంగా శైవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వడమాల, ఓబీఆర్ కండ్రిగ, అప్పలాయగుంట, ఇరగలప్ప చలం, వడమాలపేట శివాలయాలలో భక్తులకు అన్నదానం చేశారు. ఆంధ్ర నుంచే కాక తమిళనాడు నుంచి కూడా వేలాది మంది భక్తులు సదాశివకోనలో సదాశివుని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా దేవదాయశాఖ, ఉత్సవ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. అన్నదానం, ప్రసాదాల వితరణ చేశారు. అలాగే కోనకు వెళ్లే మార్గాలలో భక్తులకు పలువురు అన్నదానం, మజ్జిగ పంపిణీ చేశారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు కోనలో పటిష్ట చర్యలు తీసుకున్నారు. భక్తులకు తిరుపతి వాసన్ ఐ కేర్ ఆసుపత్రి నిర్వాహకులు, ఆయుర్వేద వైద్యులు ఓబీఆర్ కండ్రిగలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

గంగాధరనెల్లూరులో..

గంగాధర నెల్లూరు: స్థానిక గంగాధరేశ్వర ఆలయం, కొత్రకోనలోని మల్లేశ్వరస్వామి ఆలయం, మహాదేవ మంగళంలోని ఉమామహేశ్వర ఆలయం, సిద్ధేశ్వరకొండలోని సిద్ధేశ్వరాలయం, వెజ్జుపల్లెలోని ఆవుదేవర నందీశ్వర ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయాలను విద్యుద్దీపాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు.

జంబు లింగేశ్వరస్వామి సేవలో..

విజయపురం: మండలంలో చిన్న జంబాడలోని జంబు లింగేశ్వరస్వామిని ఆర్కే రోజా దర్శించుకున్నారు. ఆమె వెంట రైతు రాష్ట్ర విభాగ కార్యదర్శి గుణశేఖర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శివరాజు, వైస్ ఎంపీపీ బాలాజీ, మురళీకృష్ణారెడ్డి, సుబ్రమణ్యం, భాస్కర్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎటు చూసినా భక్తుల సందడే

కార్వేటినగరం: మండలంలోని సుద్దగుంట సమీపంలోని శిష్టా సౌందర్యవల్లీ సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి ఆలయంలో స్వామివార్లకు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉభయదారులు సమర్పించిన పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్కంధ పుష్కరిణి సమీపంలోని ఉమా తంగమేశ్వర ఆలయం, చాకలివానిగుంట వద్ద ఉన్న శ్రీ కాశీవిశ్వేశరస్వామి ఆలయం, డైట్ ఆవరణలోని ఉమా మహేశ్వర ఆలయం, కొట్టార్వేడులోని అగస్త్యేశ్వరాలయం, పాదిరికుప్పం సమీపంలోని అమ్మగారి చెరువు కట్టపై ఉన్న ఈశ్వరాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆయా ఆలయాల వద్ద భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ అర్చకులు, ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు.



కరకంఠేశ్వర ఆలయంలో శతరుద్ర మహాయాగం

ముత్తాలంలో కల్యాణోత్సవం

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎన్‌కండ్రి సమీపంలోని అరుణగిరిపై కొలువైన జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి, చవటగుంటలోని మీనాక్షి సమేత ఆవుదేవర నందీశ్వరస్వామి, బలిజ మొండివెంగనపల్లె సమీపంలోని స్వయంభు సిద్ధేశ్వరస్వామి, ముత్తాలం వద్ద ఉన్న సిద్ధేశ్వర స్వామి, తిరుమలయ్యపల్లె శివాలయాల్లో శివరాత్రి పూజలకు భక్తులు పోటెత్తారు. భక్తులు పవిత్ర స్నానమాచరించి శివపార్వతులను దర్శించుకున్నారు. ఆలయాల్లో సాంస్కతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముత్తాలంలో కనుల పండువగా శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించారు. చవటగుంటలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పేట ధనంజయరెడ్డి, సుజాత ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో గోపూజ నిర్వహించారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం: స్థానిక పల్లేరుకోనలోని శ్రీఆత్మలింగేశ్వరస్వామి అభిషేకం, మధ్యాహ్నం, రాత్రి వివిధ అభిషేకాలు నిర్వహించారు. భక్తుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక క్యూలను ఏర్పాటు చేశారు. ఉభయదారులు భక్తులకు అన్నదానం చేశారు. మరికొందరు శీతల పానీయాలను అందజేశారు. ఆలయ ఆవరణలో రాత్రి నాటకం, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

ఉచితంగా రుద్రాక్షలు, శివలింగాల పంపిణీ

పాలసముద్రం: మండలంలోని గంగమాంబపురం శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణలో హరికథ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు రుద్రాక్ష, శివలింగాలను ఉచితంగా పంపిణీ చేశారు. శ్రీకావేరిరాజుపురం పాలకొండపై ఉన్న శివలింగానికి, నొచ్చిలిలోని గిరిరాజ కన్యకా పరమేశ్వరికి పూజలు, అభిషేకాలు, రుద్రాభిషేకాలు చేశారు. తమిళనాడు, కర్ణాటక నుంచి సైతం భక్తులు విరివిగా వచ్చారు.



నాగిలేరు వద్ద అన్నదానం చేస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

శివుని సేవలో ఆర్కే రోజా

పుత్తూరు/నగరి: మహాశివరాత్రి పురస్కరించుకుని బుధవారం మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్కే రోజా పుత్తూరు మండలంలోని పలు శివాలయాల్లో పూజలు నిర్వహించారు. తొలుత తొరూరులోని కామాక్షీ సమేత సదాశివేశ్వర స్వామి, అనంతరం మూలకోనలోని శ్రీపార్వతీ సమేత శ్రీసంగమేశ్వరస్వామి ఆలయం, ఆ తర్వాత నాగిలేరు సదాశివకోన శివాలయంలో ప్రత్యేక పూజలు చేసి భక్తులకు అన్నదానం చేశారు. తదనంతరం గూళూరు చెరువు కట్టపై ఉన్న కావేరి శివలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అలాగే, కేవీపీఆర్ పేటలోని అరుణాచలేశ్వరుని దర్శించుకున్నారు. అన్నిచోట్లా ఆమెకు నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం, అర్చకులు ఆశీర్వచనం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్ జయప్రకాష్, మండల పార్టీ అధ్యక్షుడు అన్నాలోకనాథం, నాయకులు చిరంజీవియాదవ్, రవీంద్ర, దిలీప్‌మొదలి, మనోహర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మురళీయాదవ్, బాలసుబ్రమణ్యం, ప్రసాద్, వెంకటేశులురెడ్డి, భాస్కర్‌రెడ్డి, లారీమోహన్, దేవేంద్రరెడ్డి, నాయకులు రమేష్‌రెడ్డి, గంగాధరం, అయ్యప్ప, ఈవీ బాలకృష్ణ, బీడీ భాస్కర్, బాబు, బాలన్, ఇంద్రయ్య, మురుగ, బుజ్జిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గుండ్రాజుకుప్పం హనుమతేశ్వర ఆలయంలో హోమ పూజల్లో భక్తులు



కార్వేటినగరం: ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న తంగమేశ్వరస్వామి



శ్రీరంగరాజపురం: స్వామివారికి దర్శించుకుంటున్న భక్తులు



వెదురుకుప్పం: చవటగుంటలో గోపూజ చేస్తున్న భక్తులు





శ్రీరంగరాజపురం: భక్తులకు కూల్‌డ్రింక్స్ పంపిణీ చేస్తున్న బౌన్స్ కంపెనీ యాజమాన్యం, పాలసముద్రం: పాలకొండపై హోమం చేస్తున్న పండితులు

ప్రజలకు నీటి కష్టాలు

- పనిచేయని చేతిపంపులు
- పట్టించుకోని అధికారులు

పాలసముద్రం: వేసవి కాలం మొదలైంది. ఎండలు మొదలయ్యాయి. గ్రామాల్లో చేతి పంపుల మరమ్మతు లేకపోవడంతో తాగునీటి సంగతి దేవుడెరుగు కనీస అవసరాలకు కూడా నీళ్లివ్వండి మహాప్రభో అంటూ మండల ప్రజలు వేడుకుంటున్నారు. పలు గ్రామాల్లో చేతిపంపులు మరమ్మతులకు నోచుకోలేదు. గంగాధర నెల్లూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో బోర్లు రిపేర్లు కావడంతో ప్రజలకు నీటి కష్టాలు తప్పడం లేదు. మరికొన్ని గ్రామాల్లో వ్యవసాయ బావుల నుంచి నీళ్లు తెచ్చుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. వేసవిలో విద్యుత్ కోతలు వచ్చి తాగునీటి కొరత తీవ్రమైంది. అలాంటి సమయంలో చేతి పంపులు ఉంటే ప్రజలకు కాస్త ఉపశమనంగా ఉండేది. ఆరు మండలాల్లో సుమారు 5,493కుపైగా చేతి పంపులు ఉన్నాయి. అందులో 3,413 పంపులు పనిచేయడం లేదు. వాటిని మరమ్మతులు చేయాలని అధికారులను వేడుకుంటున్నా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెడిపోయిన బోర్లకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.



పాలసముద్రం జాతీయ రహదారి పక్కన నిరుపయోగంగా ఉన్న చేతిపంపు



అడవి సమీపంలోని వీర్లగుడి గ్రామంలో మరమ్మతుకు గురైన చేతిపంపు

గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని చేతి బోర్ల వివరాలు

మండలం	పంచాయతీలు	చేతిపంపులు	మరమ్మతులు
గంగాధరనెల్లూరు	32	1365	832
శ్రీరంగరాజుపురం	23	835	415
కార్వేటినగరం	21	725	498
వెదురుకుప్పం	25	1023	765
పెనుమూరు	24	985	535
పాలసముద్రం	13	560	368

ట్రాక్టర్లతో సరఫరా చేయాలి

ప్రస్తుతం ఊర్లల్లో చాలావరకు చేతి పంపులు పనిచేయడం లేదు. కొన్ని చోట్ల బోర్లలో భూగర్భజలాలు అడుగంటి పోయాయి. చేతి పంపుల్లో నీరు లేనందున గ్రామస్తులకు ట్రాక్టర్ ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలి. తద్వారా గ్రామస్తులకు నీటి బాధలు తప్పుతాయి. లేకుంటే ఈ ఎండల్లో గ్రామస్తులు నీటి కోసం అవస్థలు పడాలి.

– సీ.సుబ్రమణి, ఎస్‌కేఆర్ పురం

నిధులు ఇవ్వాలి



ప్రస్తుతం వేసవి మొదలైంది. విద్యుత్ కోతలు ఆరంభమయ్యాయి. గ్రామాల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా గ్రామంలో ఉన్న చేతిపంపులను మరమ్మతులు చేయాలి. అప్పుడే తాగునీటికి ప్రజలు అవస్థలు పడాల్సిన అవసరం ఉండదు. ప్రభుత్వం స్పందించి చేతిపంపుల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలి. –అనురేఖ, అముదాల, సర్పంచ్

చేతిపంపులు రిపేరు చేయిస్తాం



వేసవిలో గ్రామీణ ప్రజలు తాగునీటికి కష్టపడకుండా మండల పరిధిలో మరమ్మతుకు గురైన చేతిపంపులను, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరుకాగానే వెంటనే మరమ్మతు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటాం. నిధులు వస్తే తాగునీటి సమస్యలే లేకుండా చేస్తాం. –క్రిష్ణమహేష్‌రెడ్డి, పాలసముద్రం, ఎంపీడీవో

టీబీ అలర్ట్ ఇండియా ఆరోగ్య శిబిరం



అవగాహన కల్పిస్తున్న వైద్య బృందం

గుడిపాల: మండలంలోని బొమ్మసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న కుప్పిగానిపల్లెలో రచ్చబండ వద్ద టీబీ అలర్ట్ ఇండియా సహకారంతో బుధవారం ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ క్యాంపులో 115 మందికి టీబీ, అస్తమా, బీపీ, మధుమేహంతోపాటు ఇతర రక్త పరీక్షలు, ఆరోగ్య సమస్యలపై స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. డాక్టర్ రష్మిత మాట్లాడుతూ బీసీజీ వ్యాక్సిన్ 18 నుంచి 60 ఏళ్లపైబడిన వాళ్లు తప్పక వేసుకోవాలన్నారు. 23 మందికి శ్వాసకోశ సమస్యలను గుర్తించి, 11 గళ్ల పరీక్ష శాంపిల్స్ సేకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మధుసూదన్‌రాయల్, టీమ్ అలర్ట్ ఇండియా ఫీల్డ్ ఆఫీసర్ సోమశేఖర్, సూపర్‌వైజర్ లక్ష్మి, మోహన్, కమలమ్మ, వైద్య సిబ్బంది శిల్ప, దివ్య, సరస్వతి, కవిత, సుభాషిణి, సరళ, భాగ్యం పాల్గొన్నారు.